క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలోని పేదలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి జన్మదినం సందర్భంగా సుమారు 50 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. అనంతరం స్థానిక భవితకేంద్రంలో పిల్లలకు అన్నదానం నిర్వహించారు. దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, కోరాడ కృష్ణమోహన్, సామంతుల రాంబాబు, సామంతుల గోపాలకృష్ణ, మూది యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మురళీకృష్ణ



తుని: ఏపీఈఈఈ యూనియన్ 1104 రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మురళీకృష్ణ బుధవారం ఎన్నికయ్యారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఆర్.ప్రసాద్, పి.శ్రీనివాస రాజు, రాజుబాబు, ఎ.కృష్ణ, సీహెచ్ శ్రీధర్ రెడ్డి, ఎ.శ్రీనివాసరావు, ఆర్. రాంబాబు తదితరులు మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులకు బుధవారం జర్మనీలో ఉన్నత విద్యావకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైయర్ స్టడీస్ ఆపర్చునెటీస్ ఇన్ జర్మనీ అనే అంశంపై నిర్వహించిన సెమినార్లో ఉన్నత చదువులకు అక్కడ ఉన్న అవకాశాలు, ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పి.సందీప్ పాటిల్, గ్రూప్ లీడర్ ఆర్‌డబ్ల్యూటీహెచ్ ఆచెన్ యూనివర్సిటీ ముఖ్య అతిథిగా పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి, వైస్ చాన్సలర్లు ఎంటీ శ్రీనివాస్, ఎస్.రమాశ్రీ, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

జగ్గంపేట: స్థానిక దేవి సెంటర్‌కు చెందిన వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... జగ్గంపేటకు చెందిన ముద్దాడ జ్యోతి (29)కి మండలంలోని బలభద్రపురం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌తో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు సంతానం. జ్యోతి, ఆమె భర్త ప్రసాద్ బుధవారం మధ్యాహ్నం గొడవపడ్డారు. అనంతరం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి గంట తరువాత ఇంటికి వచ్చేసరికి ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయింది. ఆమెను కిందకు దించి భర్త ప్రసాద్ బంధువులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథరావు వివరించారు.

అదే తీరు.. ఆగని జోరు

- మెట్టలో ఎడితెరపి లేకుండా భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంటలను పరిశీలించిన అధికారులు



ఎస్.తిమ్మాపురం రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సీతారామారావు



కొమ్మనాపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

గోకవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జగ్గంపేట నియోజకవర్గంలో బుధవారం భారీ వర్షం కురిసింది. గోకవరం మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోకవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో అటు రైతులు, ఇటు ప్రజల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షం కారణంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

రామవరం వద్ద కండి కాలవను పరిశీలించిన ఆర్డీఓ

జగ్గంపేట: ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో జగ్గంపేట మండలంలోని వరిపంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి విజయ కుమార్, పెద్దాపురం ఆర్డీఓ సీతారామరావు బుధవారం మండలంలోని రామవరంలో వద్ద కండికాలవను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కండికాలవ ద్వారా ఏలేరునీరు ఏయే గ్రామాలకు వెళ్లే అవకాశం ఉందని ఆరా తీశారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడి వద్ద దుశలం చెరువు పొంగడంతో అక్కడ నుంచి వచ్చే నీరు కండికాలవలోకి వచ్చే అవకాశాలపై రైతులతో చర్చించారు. కృష్ణవరం వద్ద తిమ్మాపురం బెడ్ రెగ్యులేటర్ గేట్లు మూసివేయడంతో కండికాలవకు ఏలేరు నీరు వచ్చే అవకాశాలు లేవని లస్కర్లు తెలిపారని అధికారులు చెప్పారు. కండి కాలవ ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని, పుష్కర నీరు కండి కాలవలోకి రాకుండా చూడాలని ప్రజా ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట తహసీల్దార్ జీవీఆర్ రమేష్, మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్, రైతులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన అధికారులు

తుని రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు పర్యటించారు. మండలంలోని హంసవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, గవరపేట గ్రామాల్లో ఏడీఏ సంకుర బుల్లిబాబు, ఏఓ బి.అశోక్ కుమార్ పర్యటించి ఖరీఫ్ వరిపైర్లు, పత్తి పంటలను పరిశీలించారు. ముంపు నివారణకు కాలువలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంటలకు 20 కిలోలు యూరియా, పది కిలోలు పొటాష్ వేయాలన్నారు. మూడు గ్రామాల్లోనూ 350 ఎకరాల్లో పంటలు నీటిమునిగినట్టు ఏడీఏ తెలిపారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కిర్లంపూడి: అధిక వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు సూచించారు. మండలంలోని ఎస్.తిమ్మాపురం, కృష్ణవరం రెగ్యూలెటర్లను, ఏలేరు కాలువ పరివాహక లోతట్టు గ్రామాలైన రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఏలేరు కాలువ నుంచి వరద నీరు దిగువకు విడుదల చేయవలసి వస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ముక్కొల్లులో 4, రాజుపాలెంలో 3 పునరావాస కేంద్రాలను పరిశీలించినట్టు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ ఆర్ఐ జె.చిరంజీవి, ఆర్ఐ సత్యప్రసాద్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

తొండంగి: వాయుగుండం ముప్పు వీడకుండానే బంగాళాఖాతంలో మూడు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు ఏరులై పారింది. పంట పొలాలు ముంపులోనే ఉండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

కోడి పందేలాడుతున్న 10 మంది అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మామిడాడ పరిసర ప్రాంతాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై జగ్గంపేట పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడుల్లో 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.78 వేలు స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. మండలంలోని మామిడాడ, నరేంద్రపట్నం గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులతో పాటు రూ. 78 వేలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వివరించారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, మాజీ మంత్రి యనమలకు చెక్కు అందజేస్తున్న రమావాణి

తుని రూరల్: పట్టణంలోని మమత ఆస్పత్రి నిర్వాహకులు వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు తుని మండలం తేటగుంటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, కాకినాడ ఎంపీ టి.ఉదయ్ శ్రీనివాస్‌లకు ఆస్పత్రి నిర్వాహకులు ఆర్.పుష్ప రమావాణి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయాలని ఆమె కోరారు. సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, గణేష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కోటనందూరు: ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శర్మ మాట్లాడుతూ ఇప్పటికే మంజూరైన ఇళ్లకు గతంలో నిర్ణయించిన నిధులను మాత్రమే ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు మరోసారి ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదన్నారు. ఈ విషయంపై లబ్ధిదారుల్లో చైతన్యం కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించాలని సూచించారు. నిబంధనల ప్రకారం వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ఇంటింటా కుళాయిల సర్వే, హౌస్ ట్యాక్స్ ప్యూరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జోగారావు, హౌసింగ్ ఏఈ సాయిబాబు పాల్గొన్నారు.

భూములకు పాస్ పుస్తకాలు ఇవ్వాలంటూ ఆందోళన

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూములకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ పట్టణంలో బుధవారం ఆందోళన చేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ గతంలో తూర్పులక్ష్మీపురంలో దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం భూమి కొనుగోలు చేసిందన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు భూమిపై ఎస్సీలకు హక్కు కల్పించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీలకు భూమిపై హక్కుతో పాటు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నేతలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం



విజయవాడలో వరద బాధితులకు ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రామసేన సభ్యులు

గోకవరం: విజయవాడలో వరద బాధితులకు గోకవరానికి చెందిన విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆపన్నహస్తం అందించారు. వరదల్లో చిక్కుకుని ఆహారం లేకుండా అలమటిస్తున్న వారికి బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన విజయవాడ వరదల పరిస్థితి తెలుసుకుని తమ రామసేన సభ్యుల ద్వారా బుధవారం గోకవరంలో ఆహారాన్ని సిద్ధం చేయించి విజయవాడకు పంపించారు. అక్కడ వరద బాధితులకు నేరుగా పంపిణీ చేయించారు. రామసేన సభ్యులు వరదల్లో చిక్కుకున్న వారికి వద్దకు వెళ్లి వీటిని అందజేశారు. సుమారు 3 వేల బిర్యానీ ప్యాకెట్లు, 10 వేల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ తెలిపారు.

400 మందికి ఆహారం సమకూర్చిన విద్యార్థులు

మండలంలోని కొత్తపల్లికి చెందిన ఆదర్శ ఫార్మసీ కళాశాల యాజమాన్యం వరద బాధితులకు సుమారు 400 ఆహార పొట్లాలని సమకూర్చింది. కళాశాల చైర్మన్ పి.కనకరాజు ఆధ్వర్యంలో ఆదర్శ వసతి గృహ విద్యార్థులు స్వయంగా ఆహారాన్ని సిద్ధం చేసి గోకవరం రెవెన్యూ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ పి.నాగమణి, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ త్రినాథరావు, డైరెక్టర్ కె.హారిక, సంతోష్, ప్రవల్లిక, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు తాగునీరు

తుని: విజయవాడలో వరద బాధితులకు తుని పురపాలక సంఘం మంచినీరు సమకూర్చింది. 10 వేల లీటర్ల వాటరు బాటిళ్లు, 10 వేల వాటరు ప్యాకెట్లను వ్యాన్‌లో విజయవాడ తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావు తెలిపారు. టీపీఓ రాజేష్ బాబుతో పాటు 25 మంది శానిటేషన్ సిబ్బంది వరద బాధితులకు సహాయం చేయడానికి విజయవాడ తరలివెళ్లినట్లు వివరించారు.

గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

కోటనందూరు: వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. మండలంలోని బొద్దవరంలో బుధవారం సాయంత్రం గణేశ్ ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ మండపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జన కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

04టియుఎన్203 : బొద్దవరంలో గణేశ్ ఉత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

పుష్కర కాలువను పరిశీలించిన తహసీల్దార్

ప్రత్తిపాడు రూరల్: చవితి ఉత్సవాల్లో భాగంగా గణపతి నిమజ్జనం నిమిత్తం మండలంలోని పుష్కర కాలువను సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సై పవన్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్ సూర్యప్రభ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణపతి నవరాత్ర మహోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

తుని: పట్టణంలో ప్రజలకు స్థానిక అయోధ్య వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి గణపతిని పూజిద్దాం–పర్యావరణాన్ని కాపాడదాం నినాదంతో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మాడుగుల వాసుదేవరావు తెలిపారు. 200 మందికి విగ్రహాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలగా కృష్ణారావు, బోడిశెట్టి త్రిమూర్తిస్వామి, చక్కా శ్రీనివాస్, కె.అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. తాపీ మేస్త్రి సంఘం ప్రతినిధి బెల్లాని శ్రీను మనుమరాలు సత్యపావని జన్మదినాన్ని పురస్కరించుకుని టెన్త్ విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యాకమిటీ చైర్మన్ పసుపులేటి శ్రీను, కాకాడ నాగేశ్వరరావు, బూర్లు సత్తిబాబు, సుంకర సుబ్బారావు, చల్లా గణేష్, కడింశెట్టి వాసు, చలమయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



సుబ్బారావు (ఫైల్)

కిర్లంపూడి: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. కృష్ణవరం గ్రామానికి చెందిన ఉందుర్తి సుబ్బారావు (56) మంగళవారం అర్ధరాత్రి టోల్‌గేట్ సమీపంలోని అతని టీ దుకాణం నుంచి వస్తున్నాడు. ఆ సమయంలో రాజమహేంద్రవరం నుంచి వైజాగ్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు హైవే సిబ్బంది అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఏసురత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన

తుని రూరల్: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని డి.పోలవరంలో బుధవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరమాండల్ కంపెనీ సౌజన్యంతో పంటలపై డ్రోన్ సహాయంతో పురుగుల మందులు ఏవిధంగా పిచికారి చేయాలో క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. డ్రోన్ వినియోగంపై రైతులకు ఏఓ అశోక్ కుమార్, కోరమండల్ కంపెనీ ప్రతినిధులు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎకరా పొలంలో పురుగుల మందు పిచికారీకి మోతాదు మందుతో పాటు 11 లీటర్ల నీరు అవసరమన్నారు. డ్రోన్ అద్దెకు రూ.400 ఖర్చవుతుందన్నారు. తక్కువ ఖర్చుతో పురుగుల మందు పిచికారీ చేయడమే కాకుండా రైతుల ఆరోగ్యానికి ఎటువంటి నష్టం లేదన్నారు. రైతులు పురుగుల మందు పిచికారీకి డ్రోన్లను వినియోగించుకోవాలని సూచించారు.

రైతుల సంక్షేమానికి కృషి

జగ్గంపేట: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పొలం పిలుస్తోంది రా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నేత తుమ్మల బాబు, జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

గోకవరం: బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను బుధవారం గోకవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గంజాయి తరలిస్తున్నారనే అందిన సమాచారం మేరకు గోకవరం ఐటీసీఎల్ బంకు ఎదురుగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో నాలుగు కేజీల గంజాయితో గోకవరానికి చెందిన ముసుగు శివ, పంజా భద్రరావు(బద్రి)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

భవిత కేంద్రం పరిశీలన

తొండంగి: స్థానిక భవిత కేంద్రాన్ని ఐఈఆర్టీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. దివ్యాంగులకు జరుగుతున్న విద్యాబోధన, ప్రగతి, ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కోటనందూరు: మండలంలోని బొద్దవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అయినవిల్లి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు తదితరులు బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచులు సుర్ల రాంబాబు, జిగటాల వీరబాబు, వైస్సార్ సీపీ నాయకులు వెలగా వెంకటకృష్ణాజీ, వేగి అప్పలనాయుడు, గరిసింగు దొరబాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో అనారోగ్యంతో మృతి చెందిన సోడగిరి అప్పారావు కుటుంబ సభ్యులను బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం తనయుడు తోట రాంజీ బుధవారం పరామర్శించారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక



ధనలక్ష్మి



అన్నపర్తి శ్యామలాకుమారి



వై.శ్యామలా కుమారి



కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి



గణిత ఉపాధ్యాయురాలు శుభలక్ష్మి



వీఎస్‌బి దామోదరం

కిర్లంపూడి: కిర్లంపూడి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న బొడ్డేటి ధనలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఏంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కాకినాడ జరిగే కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకోనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ధనలక్ష్మికి పలువురు అభినందనలు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శ్యామలాకుమారి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఏలూరు ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తున్న అన్నపర్తి శ్యామలాకుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై నట్లు ఎంఈఓ వి.రాజబాబు బుధవారం తెలిపారు. విద్యాకార్యక్రమాల అమలు, బోధన తదితర అంశాల్లో ఆమె విశేష సేవలు అందిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాకినాడలో గురువారం జరిగే వేడుకల్లో ఆమె అవార్డు అందుకోనున్నారు. జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపికైన శ్యామలాకుమారిని ఎంఈఓ వి.రాజబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

రౌతులపూడి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు కోళ్ల రాంబాబు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్టు ఎంఈఓ-2 గాడి కొండబాబు బుధవారం తెలిపారు. అలాగే రౌతులపూడి కోట వీధి ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు ఎస్.సింహాచలం, డి.ధారపల్లి గిరిజన పాఠశాల ఉపాధ్యాయుడు వై.రాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంఈఓ వివరించారు.

గండేపల్లి: మండలంలోని మురారి ఎంపీపీ స్కూల్ టీచర్ యశాలపు శ్యామలా కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైనట్టు ఎంఈఓలు కేహెచ్ నాయక్, వెంకటరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కాకినాడలో జరిగే కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకోనున్నట్టు తెలిపారు.

తుని రూరల్: మండంలోని వి.కొత్తూరు కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న బీవీఎస్ఎన్ అమృతవాణి, గిరిజన ఆశ్రమ పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కత్తుల శుభలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యా అవార్డులకు ఎంపికయ్యారు.

శంఖవరం: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వీఎస్‌బీ దామోదరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై నట్లు మండల విద్యాశాఖాధికారి ఎస్‌వీ రమణ తెలిపారు.